# ఫోన్‌కాల్

## టెంపోరావ్

భర్త నాగేష్ ఆఫీసుకు వెళ్ళాడు. అతడు రాత్రిదాకా తిరిగిరాడు. ఒక్కపూట మాత్రం యింట్లో భోజనం చేస్తాడు. ఒకటిన్నర సంవత్సరాల బాబుకి బాటిల్లో పాలు పోసిచ్చి, తాగడం పూర్తయ్యాక అతడిని పరుపు మీద పడుకోబెట్టి జోకొట్టసాగిందామె. నోట్లో వేలు పెట్టుకుని బాబు కళ్ళుమూశాడు.

బాబు నిద్రపోయాక ఆమె వంట ప్రారంభించాలి. తనొక్కతికే తను వండుకోవాలి. వంటపూర్తయ్యేసరికి బాబులేస్తాడు. బాబుకి తిండిపెట్టి, తను తిని హాయిగా నిద్రపోవచ్చు! కాని ఆమెను బాబు ఒకంతట నిద్ర పోనివ్వడు.

రోజూ జరిగే యీ కార్యక్రమాలను గురించి సింహావలోకనం చేసుకుంటూ అనసూయ పడగ్గది కిటికీ దగ్గర నిలబడి బయటకు చూసింది. మిడ్‌లాండ్ డిపార్టుమెంట్స్ పెద్ద భవనం. అందులో ఆరు ఫ్లాట్లు వున్నాయి.

వాళ్ళుండే ఫ్లాట్ రెండో అంతస్తులో వుంది. హాల్లో మెయిన్ గేటు కనిపిస్తోంది. గేటు దాటాక వెడల్పుగా వున్న బిసంత్ రోడ్డు.

ఆమె టైముచూసింది. తొమ్మిది దాటింది. పదకొండు దాటాక బాబు లేస్తాడు. తను వంటముగించాలి, ఆ లోపల. వాడు లేస్తే ఏ పనీ చెయ్యనివ్వడు. ఆమె ఆలోచిస్తోంది.

పక్క హాల్లో వున్న టెలిఫోన్ మ్రోగింది. ఎక్కడి నుంచో భర్త ఫోన్ చేస్తూ వుండాలి! ఉషారుగా వెళ్ళి ఆమె రిసీవర్ని అందుకుంది.

"హాలో!" అందామె.

"అనసూయా?" అడిగిందో పురుష కంఠం అటు వైపునుంచి.

"ఎవరు మీరు?"

"నువ్వు అనసూయవైతే నేనెవరో చెప్తాను."

"అనసూయ నే," అందామె.

"నీతో నాకు పరిచయం లేకపోవచ్చు. నీ భర్త నాకు తెలుసు. వాడొక కిరాతకుడు," అందా కంఠం.

"హలో. ఎవరు నువ్వు?"

"ప్రస్తుతం నీకనవసరం. త్వరలో నీ భర్తను కలుసుకుంటాను."

"ఎందుకు?"

"నువ్వింత తెలివితక్కువదానివని నేనెరగను! బకాసురుడు దగ్గరకు భీముడు ఎందుకెళ్ళాడు?"

అటువైపునుంచి వెటకారంగా నవ్వు ధ్వనించింది.

"మిస్టర్, నువ్వెవరో తెలియదు. హద్దులు దాటి వాగుతున్నావు...."

"నీ మొగుడు చేసిన ఘోరాలకు హద్దులు లేవు!"

"అతడు చేసిన ఘోరాలేమిటి?"

"వాడొక బ్లడీ రేపిస్టు? నిన్ను పెళ్ళాడేముందు ఎందరో యువతుల్ని నమ్మించి, బలాత్కరించి పరారీ అయ్యాడు."

"నేను నమ్మను!" అందామె.

"ప్రేమ గుడ్డిది అన్నారందుకే పెద్దలు. వాడు చక్కగా మాట్లాడి నిన్ను వల్లో వేసుకున్నాడు. నిన్ను పెళ్ళాడాడు. నీ ఆస్తంతా వాడిచేతుల్లో వుంది. ఎప్పుడో నిన్ను కూడా వదిలేసి వుడాయిస్తాడు."

"షటప్!" అర్చిందామె కోపంగా.

"ఒక అమాయకపు యువతి నోరెత్తకుండా వాడి మోసాన్ని కొంతకాలం భరించింది. సంఘం నోరు నొక్కలేక ఆమె నూతిలోపడి ఆత్మహత్య చేసుకుంది. ఆమె నాకు బాగా తెలుసు."

"ఆమె నీ మూలంగానే మరణించి వుంటుంది."

"నీ భర్త తన గతాన్ని చీకట్లో పడేసి మీముందు పెద్దమనిషిలా నటిస్తున్నాడు. ఒకసారి వాడిని అడిగి చూడు! వాడు పిరికిపంద. వాడిని భయపెట్టు. అంతా ఒప్పేసుకుంటాడు. నీ కాళ్ళమీదపడి తన్ని కాపాడ మంటాడు. కాని నువ్వేకాదు, ఎవ్వరూ, వాడిని కాపాడ లేరు. వాడు నా చేతుల్లో చస్తాడు!"

"నీ గురించి పోలీస్ రిపోర్టిస్తాను."

"అందుకు నీ భర్త ఒప్పుకోడు. పోలీసులంటే వాడికి భయం. తన గతాన్ని వాళ్లు కనుక్కుంటారేమో అని వాడెప్పుడూ భయపడ్తూ వుంటాడు."

"అంతేనా నువ్వు చెప్పవలసింది?"

"ఇంకా చాలావుంది. ఇవాళకు యిది చాలు. మరో

సారి ఫోన్ చేసి మరి కొంత చెప్తా. బై బై!"

అటువైపునుంచి రిసీవర్ పెట్టేసిన శబ్దం వినపడింది. తన చేతిలోని రిసీవర్ని పెట్టేసి ఆమె హాల్లోని సోఫాలో కూర్చుండిపోయింది.

తనతో మాట్లాడిన వ్యక్తి యెవరు? అనవసరంగా లేని పోనివి కల్పించి అతడు తనతో యెందుకు చెప్పాడు? నాగేష్‌మీద అతడికి పగా? ఫోన్‌లోని కంఠాన్ని ఆమె యింతకు ముందు యెన్నడూ వినలేదు. ఎంత ఆలోచించినా ఆమెకు ఏమీ అర్థంకాలేదు.

ఆమె ముందు తలుపువైపు చూసింది. తలుపు గడియలు బిగించి వున్నాయి. తను జాగ్రత్తగా వుండాలి. ఎవరేనా వచ్చి తట్టగానే తలుపు తెరవకూడదు!

సోఫాలో కూర్చుని ఆమె గతాన్ని జ్ఞప్తికి తెచ్చుకో సాగింది. నాగేష్‌తో ఆమెకు పరిచయమై మూడేళ్ళయింది. అతడు మెడికల్ రిప్రజెంటేటివ్. ఒక థియేటర్లో అతడిని ఆమె మొదటిసారిగా చూసింది. పొట్టిగా, పచ్చగా, స్మార్టుగా వున్న నాగేష్ ఆమెను బాగా ఆకర్షించాడు. ఆమెవైపు చూసి అతడు సిగ్గుపడేవాడు. కొన్నిరోజులు దాకా అతడామె ముందు యెక్కువగా మాట్లాడనేలేదు. స్నేహం పెరిగాక అతడు యెంత చక్కగా మాట్లాడ తాడో ఆమె తెల్సుకుంది.

అతడిని పెళ్ళాడ్డానికి ఆమె నిశ్చయించుకొంది. తండ్రి కళ్యాణమూర్తితో చెప్పింది. అతడు ఒప్పుకోలేదు.

"మెడికల్ రిప్రజెంటేటివ్ నా అల్లుడా! నాన్ సెన్స్!" అని తోసిపుచ్చాడు తండ్రి.

కాని రహస్యంగా ఆమె అతడిని కల్సుకొంటూనే

వుంది. ఇంతలో ఆమె తల్లి చనిపోయింది. కళ్యాణమూర్తి రెండు ఫ్యాక్టరీలను నడుపుతున్నాడు. వాటిలో నాల్గో వంతు వాటా అనసూయ తల్లి పేరుంది. ఆమె పోయే ముందు తన వాటాను అనసూయ పేర వీలునామా రాసింది. తను నాగేష్‌నే పెళ్ళాడతాననీ, తన తల్లి వాటా తన కివ్వమనీ అనసూయ పట్టుబట్టింది.

నాల్గోవంతు వాటా ఇవ్వడం తండ్రికి ఇష్టంలేదు. వీలునామా ప్రకారం ఆమెకు రావలసిన వాటాకు విలువకట్టి, ఐదులక్షలిచ్చి కూతుర్ని బయటకు పొమ్మన్నాడు కళ్యాణమూర్తి.

"ఈ డబ్బుతో పోయి వాడితో గంగలో దూకు!" అన్నాడతను.

ఆమె నాగేష్‌ని పెళ్ళాడింది. రెండు లక్షలు పెట్టి ఆ ఫ్లాట్ కొంది. తతిమ్మా డబ్బును ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో భర్త వుంచాడు. అంత డబ్బువున్నా అతడు వుద్యోగం మానలేదు. కష్టపడి పని చేస్తున్నాడు. జీతం రాగానే అంతా ఆమె కిస్తున్నాడు. వాళ్ళ జీవితం సుఖంగా, హాయిగా సాగుతోంది. ఆ పండంటి జీవితానికి యీ ఫోన్ కాల్ గొడ్డలిపెట్టులా పరిణమిస్తోంది.

అనసూయ కన్నీళ్ళను తుడుచుకుంది. ఎవరో ఏదో చెప్తే తను నమ్మకూడదు. ధైర్యంగా పెళ్ళాడినట్లే ధైర్యంతో తను వ్యవహరించాలి. తనతో తెగ తెంపులు చేసుకున్న తండ్రి యెవరిచేతో అలా ఫోన్ చేయించే దేమో!

అమ్మ పోగానే ఆమె తండ్రి మళ్ళా పెళ్ళిచేసుకున్నాడు. తన సవితల్లి యిదంతా చేయిస్తోందేమో.

ఎవరో తలుపును తట్టారు. ఆమె వులిక్కిపడింది. తలుపు

దగ్గరగా వెళ్ళింది. గుండె దడదడ కొట్టుకొంటోంది.

"పోస్టు!" అందో కంఠం అటువైపునుంచి.

తాళంచెవి చిల్లులోంచి ఆమె బయటకు చూసింది. తలుపు తెరిచే ధైర్యం ఆమెకు లేదు. "పోస్టు" అంటూ హంతకులు లోపలకు ప్రవేశిస్తారు.

"తలుపు కిందనుంచి వుత్తరాలు లోపల పడేయి" అరిచిందామె.

ఒక కార్డు, కవరు తలుపు కిందనుంచి లోపలకు వచ్చాయి. బయటనున్న వ్యక్తి నిజంగా పోస్టుమన్నే.

ఆమె వుత్తరాలను తీసుకొని వెనక్కి తిరిగింది. టెలిఫోన్ మ్రోగింది. మళ్ళా వాడేనా? మెల్లిగా వెళ్ళి రిసీవర్ని అందుకుంది.

"హలో" అందామె.

"అనూ, ఏం చేస్తున్నావు?"

భర్త కంఠం. తన భర్త నాగేష్.

"నాగేష్, నాకు భయంగా వుంది...."

"ఎందుకు భయం? క్రయిమ్ నవలలు చదవొద్దంటే వినవు!"

"అదికాదు నాగేష్. నువ్వు యెప్పుడొస్తావు?"

"రోజూలా ఏడింటికి."

"ఇవాళ తొందరగా రా! నా కోసం."

"నువ్వు రమ్మంటే రాకుండా వుండగలనా? ఐదింటికి వస్తాలే."

"థాంక్స్" అందామె.

"బాబుగాడు ఏం చేస్తున్నాడు?"

"పడుకున్నాడు."

"వంట అయిందా?"

"ఇంకా మొదలెట్టలేదు."

"నేను యింట్లో లేకపోడం వలన లంచ్ మీద నీకు శ్రద్ధ క్షీణిస్తోంది. అన్నీ రాత్రి వండుతున్నావు!"

"ఒక్కపూట బాగా తింటే చాలు, బతకడానికి."

"మైడియర్, అక్కడే పొరబడుతున్నావు. నేను నీ కోసం తింటున్నాను. నీకోసం జీవిస్తున్నాను. అలాగే నువ్వు నాకోసం రెండు పూట్లా తినాలి. నాకోసం బతకాలి" అన్నాడతను.

"మన పెళ్ళి నిన్నో, మొన్నో అయినట్లు మాట్లాడుతున్నావు."

"అనూ, ప్రతిరోజూ నా కళ్ళకు నువ్వు పెళ్ళికూతురులాగే కనిపిస్తావు."

"నాగేష్, తొందరగా రా" అందామె.

"ఈట్ వెల్, మైడియర్, బై బై" అన్నాడతను.

ఆమె రిసీవర్ని పెట్టేసి వంటగదిలోకి వెళ్ళింది.

## 2

ఐదింటికి వస్తానన్న నాగేష్ యింటికొచ్చేసరికి ఎనిమిది దాటింది. అతడు తలుపు తట్టాడు.

"ఎవరు?" అంది అనసూయ లోపలనుంచి.

"నేనే" అని అతడు జవాబిచ్చాక ఆమె తలుపు తెర్చింది.

ఒంటరిగా కారమ్స్ ఆడుతున్న బాబు రెండు పిక్కల్ని దూరంగా విసిరి "నాన్నా!" అంటూ నాగేష్ వైపు తప్పటడుగులు వేశాడు.

బాబును ఎత్తుకుని, ముద్దాడుతూ నాగేష్ సోఫాలో కూర్చున్నాడు. తలుపుమూసి, గడియాలు బిగించి ఆమె అతడి కెదురుగా వున్న మరో సోఫాలో కూర్చుంది.

"అనూ యిలారా" అన్నాడతను.

"నాన్నా, బిస్కెట్" అన్నాడు బాబు.

తన బాగ్‌లోంచి చిన్న బిస్కట్ల పాకెట్ తీసి అతడు బాబుకిచ్చాడు. ఆమె లోపలకు వెళ్ళి, కాస్సేపట్లో కాఫీ తెచ్చి భర్త కిచ్చింది. అతడామె చెయ్యి పట్టుకులాగాడు. ఆమె ఆతడి పక్కనే కూర్చుంది.

నాగేష్ చెయ్యి ఆమె నడుమును చుట్టేసింది.

బాబు బిస్కట్ నవుల్తున్నాడు.

"అనూ, ఏమిటలా వున్నావు?" అడిగాడతను.

ఆమె సీరియస్‌గా ఆతడివైపు చూసింది.

"నాగేష్, నీకెవరేనా శత్రువులు వున్నారా?" అడిగిందామె.

"వుంటే వుండొచ్చు. గాంధీజీ లాంటి వ్యక్తికే శత్రువులుండేవారు. మనలాటి వాళ్ళకు వుంటే ఆశ్చర్య పడనక్కరలేదు."

"నీ కంపెనీలో వున్నారా?"

"వుండొచ్చు. మా కంపెనీలో నాలా యెందరో రిప్రసెంటేటివ్స్ వున్నారు. నాకు జీతం యెక్కువ. జీతం కాక, ఆంధ్రా, తమిళనాడు రాష్ట్రాలలోని సేల్సుమీద నాకు 1/4 పర్సంట్ కమిషన్ వస్తుంది. ఈ రెండు రాష్ట్రాల్లోనూ మా కంపెనీ మందులు సాలుకి కోటిరూపాయలు పైన అమ్ముబడతాయి. నా రాబడి చూసి మా కంపెనీలోని కొందరు అసూయపడొచ్చు."

ఆమె అతడివంక సూటిగా చూసింది.

"నాగేష్, యీ ఫ్లాట్ నీ పేరుంది. ఫిక్సెడ్ డిపాజిట్లు అన్నీ నీ పేరులోనే వున్నాయి...."

"నేను నీ హృదయంలో వున్నాను. నా హృదయంలో

నువ్వన్నావు" అన్నాడతను నవ్వుతూ.

"ప్లీజ్, జోక్ గా మాట్లాడొద్దు" అందామె.

అతడామెను చేతుల్లో పట్టుకుని, పెదిమాలను ముద్దెట్టుకున్నాడు. ఆమె పక్కకు తిరిగిపోయి, తిరగలేక వూరుకుంది.

"అనూ, ఇవన్నీ యెందుకు అడుగుతున్నావు?"

ఆమె జవాబివ్వలేదు.

"నీ గతాన్ని గురించి చెప్పు, నాగేష్."

"నా గతంలో చెప్పుకోదగినది ఏమీ లేదు. నా తల్లిదండ్రులు పోయాక మావయ్య యింట్లో పెరిగాను. ఎవరి మీద కోపం వచ్చినా మావయ్యా నన్నే కొట్టేవాడు. అతడు యింట్లో లేనప్పుడు అత్తయ్య నన్ను కొట్టేది. ఆ బాధ పడలేక నేను యిల్లువిడిచి పారిపోయాను. ఎన్ని కష్టాలో పడి చివరికి యీ మందుల కంపెనీలో చేరాను. నాకు మనుషులంటే అసహ్యమేసేది. నా తెలివితేటల్తో వాళ్ళను ఓడించి ఆనందించేవాడిని. నీ పరిచయం అయ్యాక నా మనస్తత్వం మారింది. నీదగ్గర ఓడిపోయి, ఓడిపోడంలో కూడా ఆనందం వుందని గ్రహించాను."

"నాగేష్, నువ్వు ఏ యువతినైనా రేప్ చేశావా?" ఆమె కంఠం పిస్టల్ షాట్ లా వుంది.

అతడి మొహంలోని చిరునవ్వు మాయమైంది.

"చేశాను."

"ఎవరా అభాగ్యురాలు?"

"నువ్వే!" అన్నాడతను పకపక నవ్వుతూ.

"నీకంతా హాస్యమే" అందామె చిరాకుగా.

"మైడియర్, టేకిట్ యీజీ! ఏమైందో చెప్పు! ఈ పిచ్చిప్రశ్నలు యెందుకు అడుగుతున్నావు? డొంక చుట్టూ

తిరగడం మాని ముక్కుసూటిగా రా!"

టెలిఫోన్ కాల్ గురించి ఆమె వివరంగా చెప్పింది. అతడు నవ్వేశాడు.

"ఎవడో మూర్ఖుడు యివాళ ఏప్రిల్ ఫస్టు అనుకొని పారబడ్డాడు. ఫర్‌గెట్ హిమ్!" అన్నాడతను.

"వాడు సీరియస్‌గా చెప్పాడు. ఆ అమ్మాయి నూతిలో పడి చచ్చిందట."

నాగేష్ ఆమెవంక సూటిగా చూశాడు. ఆమె చెయ్యి పట్టుకున్నాడు. "నువ్వు చెప్పింది విన్నాక ఒక విషయం గుర్తుకొస్తోంది. ఇది కాకినాడలో జరిగింది. ఒక యింట్లో గది అద్దెకు తీసుకుని నేను వుండేవాడిని. తల్లి, కొడుకు, కూతురు ఆ యింట్లో వుండేవారు. ఆ అమ్మాయి నన్ను వదిలేది కాదు. ఒకనాటి రాత్రి ఆమె నా గదిలోకొచ్చి నా పక్కనే పడుకొంది. నన్ను ఆవేశపర్చింది. ఏం జరుగుతోందో తెలిసేలోపలే అంతా జరిగిపోయింది. నన్నా విధంగా బంధించి పెళ్ళాడాలని ఆమె కోర్కె. అది గ్రహించి నేను రహస్యంగా యిల్లు ఖాళీచేసి వెళ్ళిపోయాను. తర్వాత ఆమె గురించి నాకు తెలియదు. ఆమెకు నేను ఏ ఆశలూ చూపించలేదు. ఆమె ప్రోత్సాహం మూలంగానే అంతా జరిగింది. అది నీతో చెప్పకపోవడం నేను చేసిన తప్పు" అన్నాడతను.

ఆమె అతడివైపు కోపంగా చూసింది. కొంచెం దూరంగా జరిగింది.

"నీ జీవితంలో మొదటి యువతి నేనే అని పొరబడి, సంతోషించాను" అందామె గాయపడినట్లు అతడివేపు చూస్తూ.

"మనస్ఫూర్తిగా నన్ను నేనర్పించుకొన్నది నీకే.

తార్కికంగా అదే నా తొలి అనుభవం అవుతుంది" అన్నాడతను.

ఆమె పళ్ళు పటపట కొరికింది.

"మనుషులను మాటల్తో తృప్తిపర్చడం నీకు బాగా తెలుసు" అందామె.

అతడామె దగ్గరగా జరిగాడు. ఆమెను పట్టుకోడానికి ప్రయత్నించాడు. ఆమె సోఫాలోంచి లేచింది. వంటగది లోంచి ఏదో చప్పుడు వినపడి ఆమె అటు పరుగెత్తింది. పెద్ద అల్యూమినం డబ్బా కింద పడివుంది. బాబు మొహం నిండా, చేతులు నిండా గోధుమపిండి.

"మామాం" అన్నాడు బాబు.

"రాస్కెల్, యిక్కడి కెప్పుడొచ్చావు" అర్చిందామె వాడిని గుడ్డతో తుడుస్తూ.

వంటగది గుమ్మంలో నిలబడి వున్నాడు నాగేష్. బాబును యెత్తుకొని ఆమె గుమ్మం ముందుకు వెళ్ళింది.

"పక్కకు జరుగు" అందామె.

"నీ జీవితంలోంచి జరిగిపొమ్మంటావా?" అడిగాడతను.

"ఎలా అర్థం చేసుకొంటే అలా చేయొచ్చు" అంది ఆమె.

నాగేష్ వెనక్కు తిరిగి ముందు హాల్లోకి వెళ్ళిపోయాడు. సోఫాలో కూర్చుని సిగరెట్ వెలిగించాడు. పొగవదుల్తూ నలువైపులా చూశాడు. ఆమె బాబుతో పక్కగదిలో వుంది.

అనసూయలో తనమీద ఆగ్రహం బాగా రగులుకొంది. ఇప్పుడు తనేం చెప్పినా ఆమె వినదు.

అలా యెందుకు జరిగింది? తను లేని సమయంలో ఇంటి కెవరొచ్చారు? ఆమె మనసులో తనమీద ద్వేషం పుట్టే

టట్లు వాళ్ళేదో చెప్పుండాలి. ఫోన్ కాల్ రావడం హంబగ్! ఎవరో వచ్చి, తనమీద యింతో చెప్పి వెళ్ళి పోయివుండాలి. ఫోన్ వచ్చినట్లు ఆమె తనతో అబద్ధం ఆడివుండాలి.

నిమిషాలు గడుస్తున్నాయి. రాత్రి పది కావస్తోంది. ఆమె హాల్లోకొచ్చి దూరంగా నిలబడింది.

"వంటింట్లో డైనింగ్ టేబులుమీద అన్నీ వున్నాయి. నేను తినేశాను. వెళ్ళి పెట్టుకుతిను" అని ఆమె వెనుదిరిగి వెళ్ళిపోయింది.

## 3

"అమ్మా, పాలు" అర్చింది కన్నమ్మ.

ఎన్ని సార్లు తలుపుతట్టినా యెవ్వరూ రాలేదు. తలుపును తోసిందామె. తలుపు తెరిచేవుంది. ఆమె హాల్లోకి వెళ్ళి, టీపాయిమీద రెండు పాలపాకెట్లను పెట్టి "అమ్మా!" అని మళ్ళా పిల్చింది.

లోపలనుంచి ఏదో ఏడుపు వినపడింది. బాబు ఏడుస్తున్నాడని గ్రహించి ఆమె లోపలకు వెళ్ళింది. బాత్ రూమ్‌లో నేలమీద అనసూయ శవం నగ్నంగా, రక్తం మడుగులో పడుంది. ఆమెమీద పడి బాబు ఏడుస్తు వున్నాడు.

గదిలోకొచ్చిన కన్నమ్మవంక బాబు చూశాడు. అతడి కళ్ళు ఏడ్చి, ఏడ్చి యెర్రబడ్డాయి.

"ఆయా, అమ్మ!" అన్నాడు బాబు ఆమెను చూసి.

కన్నమ్మ నేలమీద పడున్న అనసూయవైపు మళ్ళా చూసింది. కత్తితో యెవరో ఆమెను పొడిచి, పొడిచి చంపారు. అనేక చోట్ల ఆమె ఒంటిమీద రక్తం గడ్డ కట్టింది. సమీపంలో కత్తి పడుంది.

బాబును యెత్తుకోబోయి, ఆగి, ఆమె వెనక్కి తిరిగి పరుగెత్తింది. పక్క ఫ్లాట్‌లో వున్న అడ్వకేటు రామ చంద్‌కి అంతా చెప్పింది. అతను కన్నమ్మతో వెళ్ళి శవాన్ని చూశాడు.

"అంకుల్" అన్నాడు బాబు అడ్వకేట్‌ని చూసి.

రామచంద్ వెనక్కి తిరిగాడు. బాబు ఏడుపు విని పిస్తోంది.

"కన్నమ్మా, నేను పోలీస్ రిపోర్టు యిస్తాను. నువ్వు వెళ్ళిపోకు" అన్నాడతను.

"అలాగే వుంటానయ్యా! ఆ పసిబిడ్డను చూస్తే గుండె కరిగిపోతోంది. వాడికి ఏ పాలో యిస్తే బాగుంటుం దయ్యా" అందామె.

"పోలీసులు వచ్చినదాకా మనం ఏమీ చెయ్యకూడదు" అన్నాడు రామచంద్.

కన్నమ్మ ఫ్లాట్ ముందు నడవలో కూర్చుండిపోయింది. లోపలనుంచి బాబు ఏడుపు వినిపిస్తోంది. అడ్వకేట్ రామ చంద్ టెలిఫోన్ చేసి బయటకొచ్చాడు.

"కొన్ని నిమిషాల్లో పోలీసులు యిక్కడుంటారు" అన్నాడతను, విచారవదనంతో కూర్చున్న కన్నమ్మను చూసి.

ఇన్స్‌పెక్టర్ నాయర్ అరడజన్ కానిస్టేబుల్స్‌తో పైకొచ్చాడు. నడవలో అనేకమంది గుమిగూడారు.

"నా పేరు రామ్‌చంద్. మీకు ఫోన్ చేసింది నేనే," అడ్వకేట్ తనని పరిచయం చేసుకొన్నాడు.

"రామ్‌చంద్ గారూ, పదండి, శవాన్ని చూద్దాం." అన్నాడు ఇన్స్‌పెక్టర్.

"నడవలో గుమిగూడిన వాళ్ళకు యిద్దరు కాని

స్టేబుల్సు వెనక్కు తరిమేసారు. ఇన్స్పెక్టర్ నాయర్, అడ్వకేటు రామ్‌చంద్ ఫ్లాట్‌లోపలకు వెళ్లారు. విశాలమైన బాత్ రూమ్. మెరుస్తూన్న మొజాయిక్ ఫ్లోర్ మీద పడున్న శవాన్ని ఇన్స్పెక్టర్ పరీక్షించాడు. గదిలోకొచ్చిన వాళ్ళను చూసి బాబు భయంతో ఏడ్వసాగాడు.

బాబువైపు సానుభూతితో చూశాడు నాయర్. అతడు ధరించిన లాగు మూత్రంతో తడిసివుంది. అతడి బనియన్‌కి రక్తం మరకలున్నాయి. ఇన్స్పెక్టర్ నాయర్ సమీపంలో వున్న కానిస్టేబుల్ వంక చూశాడు.

"ఫోటోలు వెంటనే తీయించు. ఆ కుర్రాడిని మనం యిక్కడనుంచి బయటకు తర్వాత తీసుకుపోవచ్చు," అన్నాడు ఇన్స్పెక్టర్.

ఇన్స్పెక్టర్ నాయర్ గది నలువైపులా చూశాడు. గోడవారగా బేతింగ్ టబ్ వుంది. టబ్ నిండా నీళ్ళు ఉన్నాయి. హత్యకు ఉపయోగించిన కత్తిని పరీక్షగా చూశాడు నాయర్.

నేలమీద సిల్కు చీర, నల్లటి పావడా, జాకెట్, బ్రాసియర్ పడున్నాయి. ఫోటోలు తీశాక ఇన్స్పెక్టర్ నాయర్ పక్కనున్న అడ్వకేటువైపు తిరిగాడు.

"ఈ పసివాడిని శుభ్రపర్చి, పాలు యివ్వమనండి," అన్నాడు నాయర్.

రామ్‌చంద్ దూరంలో వున్న కన్నమ్మకు సౌజ్ఞ చేశాడు. ఆమె గదిలోకొచ్చింది.

"బాబును మా యింటికి తీసుకెళ్ళి కడుగు. బాటిల్లో పోసి పాలిమ్మని నా భార్యతో చెప్పు," అన్నాడు రామ్‌చంద్.

కన్నమ్మ బాబును ఎత్తుకోబోయింది. కాని వాడు

తల్లిని వదల్లేరు.

"అమ్మా! అమ్మా!" అని పిచ్చిగా ఏడుస్తున్నాడు.

బాబును లాగి, ఎత్తుకొని కన్నమ్మ బయటకు నడిచింది.

ఇన్స్పెక్టర్ నాయర్ రామ్‌చంద్‌తో హాల్లో కొచ్చాడు.

"ఈ ఫ్లాట్ ఎవరిది?"

"మిస్టర్ నాగేష్‌ది. హత్య చేయబడిన వ్యక్తి అతడి భార్య అనసూయ. బాబు ఒక్కడే వాళ్ళకు సంతానం. ఆమె తండ్రి కళ్యాణమూర్తి యీ పట్నంలోనే వుంటున్నారని విన్నాను."

"అతడి అడ్రస్ తెలుసా?"

"టెలిఫోన్ డైరక్టరీలో వుంటుంది."

"శవాన్ని మొదట ఎవరు చూశారు?"

"బాబును తీసుకెళ్ళిన కన్నమ్మ. ఇక్కడి ఫ్లాట్స్‌లో వుండేవాళ్ళకు మిల్క్ డిపోనుంచి ఆమె పాలపాకెట్లు తెచ్చిపెడ్తుంది."

ఇన్స్పెక్టర్ నాయర్ కాస్సేపు ఆలోచిస్తూవుండి పోయాడు.

"నాగేష్ ఏమయ్యాడు?"

"నిన్న పొద్దుట అతడిని చూశాను."

"అతడికి కారుందా?"

"ఫియట్ కారుంది. కారు షెడ్లు బిల్డింగ్ వెనకవైపున వున్నాయి."

"వెళ్ళి చూద్దాం, రండి!"

ఇన్స్పెక్టర్ నాయర్, అడ్వకేట్ రామ్‌చంద్ క్రిందకు దిగారు. బిల్డింగ్ వెనకవైపుకు వెళ్ళారు. వరుసగా ఆరు కారుషెడ్లు వున్నాయి. నాగేష్ ఫ్లాట్‌కు చెందిన కారుషెడ్ ఖాళీగా వుంది. ఫియట్ కారులేదు.

"నాగేష్ ఎక్కడికో వెళ్లుండొచ్చు," అన్నాడు అడ్వకేటు రాంచంద్.

షెడ్‌లోంచి వాళ్ళు బయటకొచ్చారు.

"మీ యింట్లో ఫోనుందిగా?" అన్నాడు ఇన్స్పెక్టర్.

"వుంది. అక్కడనుంచే మీకు ఫోన్ చేశాను."

"పదండి. కొన్ని కాల్సు చెయ్యాలి," అన్నాడు నాయర్.

టెలిఫోన్ డైరెక్టరీ పేజీలు తిప్పిచూసి నాయర్ ఒక నంబర్ని తిప్పాడు.

"హలో, కళ్యాణమూర్తి హియర్," అంది అటువైపు కంఠం.

"ఇన్స్పెక్టర్ నాయర్ స్పీకింగ్! మీరు వెంటనే మిడ్లాండ్ అపార్టుమెంట్స్‌కు రండి. మీ అమ్మాయి అనసూయను ఎవరో హత్య చేశారు!"

"గుడ్ హెవన్స్!" అరిచాడు కళ్యాణమూర్తి.

"వేగంగా రండి," అని నాయర్ రిసీవర్ పెట్టేశాడు.

రిసీవర్ ఎత్తి మరో నెంబర్ తిప్పాడు నాయర్.

టెలిఫోన్‌లో మాట్లాడి యిన్స్పెక్టర్ నాయర్ అడ్వకేట్‌కి థాంక్స్ చెప్పాడు.

"ఇన్స్పెక్టర్, నేను కోర్టుకు వెళ్లాలి," అన్నాడతను.

"నాగేష్‌ను గురించి మీరు ఏమైనా చెప్పగలరా?"

"ఈ బిల్డింగ్స్‌లో మొత్తం ఆరు ఫ్లాట్లు వున్నాయి. బాగా డబ్బున్నవాళ్ళు యిక్కడ నివసిస్తూ వుంటారు. ఒకే అంతస్తులో వుండడంవలన అనసూయ మా ఫ్లాట్‌కి వచ్చి నా భార్యతో మాట్లాడుతూ వుండేది. నిజం చెప్పాలంటే వాళ్ళను గురించి నాకంతగా తెలియదు."

"థాంక్స్, మీరు వెళ్ళండి," అని నాయర్ బయటకు నడిచాడు.

## 4

మేడ మెట్లెక్కి పైకి వెళ్ళాను. నడవలో ఇన్స్పెక్టర్ నాయర్ నా కెదురయ్యాడు.

"బ్రదర్, నీ రాకకోసం ఎదురుచూస్తున్నాను," అన్నాడతను.

నడవలో యిరవైమంది పైన నిలబడివున్నారు. ఒక కానిస్టేబులు వాళ్ళను ముందుకు రానివ్వడంలేదు. ఫ్లాట్ నెంబర్ 5 లోపలకు యిన్స్పెక్టర్ నాయర్‌తో వెళ్లాను. విశాలమైన హాలు. సోఫాలో లెదర్ బాగ్ వుంది.

లోపలున్న బాత్‌రూమ్‌లోకి వెళ్ళాను. అనసూయ శవం నగ్నంగా పడుంది. డాక్టర్ సుధాకర్ శవాన్ని పరీక్షిస్తున్నాడు. శవంవైపు చూశాను. ఆమె అంత అందమైనది కాకపోయినా యవ్వనంలో వుంది. చెవులు, మెడ, చేతులు బోడిగా వున్నాయి. కత్తితో ఆమెను నాలుగుసార్లు పొడిచి వుండాలి.

శవం సమీపంలో వున్న కత్తివంక చూశాను. కూరలూ అవీ కోసే స్టెయిన్‌లెస్ స్టీల్ కత్తి. కర్ర పిడి వుంది. కత్తిమీద రక్తం మరకలున్నాయి,

ఎదురుగా వున్న టబ్ దగ్గరకు వెళ్ళాను. పైదాకా నీళ్ళు వున్నాయి. టబ్‌లోని నీళ్ళు శుభ్రంగా వున్నాయి. స్నానంచేయాలనే ఉద్దేశంతో ఎవరో టబ్ టాప్ తెరిచి నింపివుంటారు. కాని స్నానం చేసుండరు!

శవంవైపు చూశాను. ఆమె స్నానం చెయ్యాలనుకుందా? ఈ లోపల హంతకుడొచ్చి ఆమెను హత మార్చాడా? డాక్టర్ సుధాకర్ దగ్గరకు వెళ్లాను.

"పరశురామ్ గారూ. గతరాత్రి పన్నెండూ, ఒంటి గంట మధ్య యీమె మరణించి వుండొచ్చు!" అన్నాడతను.

"ఆమె రేప్ చేయబడిందా?"

"అటువంటి సూచనలు లేవు."

డాక్టర్ సుధాకర్ ఆమె ఒంటిమీద సమీపంలో వున్న చీరను కప్పేశాడు. కత్తిపిడిని వేలిముద్రల కోసం చూస్తున్నారు. ఫింగర్ ప్రింట్ ఎక్స్‌పర్టు రుద్రయ్య విజయవంతంగా నావంక తిరిగాడు.

"కుడిచేతి వేలిముద్రలు వున్నాయి సార్," అన్నాడు రుద్రయ్య.

ముందు హాల్లోకి వెళ్లాను. ఇన్స్‌పెక్టర్ నాయర్ టీపాయిమీదున్న రమ్‌బాటిల్ చూస్తున్నాడు.

"బ్రదర్, దానిమీద నాగేష్ వేలిముద్రలు వున్నాయి. ఈ గ్లాసుమీద, ఆ లెదర్ బాగ్ మీద కూడా అతడి వేలిముద్రలు వున్నాయి," అన్నాడు నాయర్.

గబగబా రుద్రయ్య హాల్లోకొచ్చాడు.

"ఇన్స్‌పెక్టర్, కత్తి పిడిమీదున్న వేలిముద్రలూ, ఈ రమ్‌బాటిల్ మీద వున్నవీ ఒకడివే!" అన్నాడు రుద్రయ్య.

"నాగేష్‌వి!" అన్నాడు నాయర్.

ఇండియా కింగ్స్ సిగరెట్ వెలిగించి పొగవదుల్తూ నాయర్ వైపు చూశాను. "బ్రదర్, నాగేష్ తనభార్యతో దేన్ని గురించో పోట్లాడివుంటాడు. అతడు ఈ రమ్ బాటిల్లోంచి మూడొంతులపైన తాగేశాడు. అటుపైన ఆమెను బాత్ రూంలోకి తీసుకెళ్ళి అక్కడ చంపి కాపలో పారిపోయాడు," అన్నాడు నాయర్.

రమ్‌బాటిల్ వైపు చూశాడు. 750 ఎమ్.ఎల్ ద్రవం వుండవలసిన బాటిల్లో నాలోవంతు మాత్రం వుంది. అంత రమ్ తాగిన వ్యక్తి కదిలే స్థితిలోవుండడు. ఎక్కడో పడి మూలుగుతూ వుంటాడు. ఆ స్థితిలో అతడు భార్యను చంపే అవకాశంలేదు.

"నాయర్ భాయ్, నాగేష్ తన భార్యను ఎందుకు చంపివుంటాడు?"

"అది కనుక్కోవాలి!" అన్నాడు నాయర్.

పంచ, లక్నోజుబ్బా ధరించిన ఒక వ్యక్తి అరుస్తూ హాల్లోకొచ్చాడు.

"నాకు మొదటనుంచి తెలుసు. ఆ దుర్మార్గుడెప్పుడో యిలా చేస్తాడని," అన్నాడతను.

"కళ్యాణమూర్తిగారు మీరేనా?" అడిగాడు యిన్స్పెక్టర్ నాయర్.

"అవును, నేనే. అనసూయ తండ్రిని."

అతడివైపు సూటిగా చూశాను.

"ఈ పెళ్ళి మీ అనుమతి లేకుండా జరిగిందా?" ప్రశ్నించాను.

"వాడిని పెళ్లాడవద్దని నేనెంతగానో చెప్పాను. అది వింటేగా! ఏ మందో పెట్టి దాని మనసును పూర్తిగా వాడు దోచుకున్నాడు. నేనిచ్చిన ఐదులక్షలు తీసుకొని బయటకుపోయి వాడిని పెళ్ళాడింది."

"మీరెందుకంత డబ్బిచ్చారు?"

"నా భార్య పోయింది. నా కంపెనీలో నా భార్యకుండే వాటా కూతురికి వీలునామా ప్రకారం యివ్వవలసి వచ్చింది. నా కంపెనీలో అదీ, దానితో వాడూ వుండడం యిష్టంలేక డబ్బిచ్చి వదిలించుకున్నాను," అన్నాడతను.

"మీ అమ్మాయితో మీరు మాట్లాడేవారా?"

"నేను మాళ్లా దాన్ని ఎన్నడూ చూడలేదు. నేనిచ్చిన డబ్బుతో వాడు యీ ఫ్లాట్ కొన్నాడని ఎవరో చెప్పారు. తతిమా డబ్బంతా ఏం చేశాడో!"

బాత్ రూమ్‌లోకి కళ్యాణమూర్తిని తీసుకెళ్ళాను. నేలమీద పడున్న శవంవైపు అతడు ఓసారి చూసి వెనక్కి తిరిగాడు.

"నాగేష్ చెడ్డవాడని మీకు బాగా తెలుసా?"

"లెదర్ బాగ్ పట్టుకుని ఊళ్ళమ్మట తిరిగే మెడికల్ సేల్సుమన్ వాడు. తన వాళ్ళెవరూ లేరు. పెళ్ళిముందు అతడిని గురించి వివరాలన్నీ కనుక్కోమని ఒక డిటెక్టివ్ ఏజన్సీని నేను కోరాను. వాళ్ళు పెద్ద రిపోర్టు పంపారు. వాడు జులాయిగా తిరిగే మనిషి, బాగా తాగుతాడు, అని రిపోర్టులో వాళ్ళు రాశారు."

"ఆ రిపోర్టు మీ దగ్గర వుందా?"

"ఫైల్లో వుండొచ్చు"

"ఆ రిపోర్టును మీ అమ్మాయికి చూపించారా?"

"లేదు. నేను తెలుసుకున్న విషయాలు ఆమెతో చెప్పాను. నేను వద్దన్నకొద్దీ వాడిమీద ఆమె ప్రేమ మరీ పెరిగిపోయింది!"

"కళ్యాణమూర్తిగారూ, ఆ రిపోర్టు నాకివ్వండి. అది మా పరిశోధనకు వుపయోగపడొచ్చు," అన్నాను.

"ఇస్తాను, సార్. నా కూతుర్ని చంపిన ఆ దుర్మార్గుడు మీకు చిక్కేందుకు నేనన్నివిధాలా తోడ్పడతాను."

కళ్యాణమూర్తి నాతో హాల్లోకి నడిచాడు. అక్క

డున్న సోఫాలో అతడు విచారవదనంతో కూర్చున్నాడు. ఇన్స్పెక్టర్ నాయర్ నన్ను గెస్టు రూమ్‌లోకి తీసుకు వెళ్ళాడు.

"బ్రదర్, ఈ గదిని మనం కొన్ని గంటలవరకూ ఆఫీసుగా వుపయోగించుదాం. అలా కూర్చో," అన్నాడు నాయర్.

సోఫాలో కూర్చున్నాను. ఎదురుగా నాయర్ కూర్చున్నాడు.

"బ్రదర్, నాగేష్ యీ హత్య చేశాడని వేలిముద్రలనుబట్టి అనుకున్నాను. కాని అది సిల్లీగా కనిపిస్తోంది. ఈ యిల్లు నాగేష్ పేర్న వుంది. కళ్యాణమూర్తి యిచ్చిన తతిమ్మా డబ్బు ఏమైందో మనం కనుక్కోవాలి. కన్నమ్మతో నువ్వు మాట్లాడాలి. ఈ బిల్డింగ్ వాచ్‌మన్ మస్తాన్ని కూడా యీ గదిలోకి పంపుతాను."

"గుడ్! వాళ్ళను రమ్మను," అన్నాను.

ఇన్స్పెక్టర్ నాయర్ బయటకు వెళ్ళాడు. సోఫాలో కూర్చుని తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. టైమ్ చూశాను. పది కావస్తోంది. హాల్లోని టెలిఫోన్ వైపు నడిచాను. నాయర్ నా దగ్గరకొచ్చాడు.

"టెలిఫోన్ వుపయోగించవచ్చు. ఫింగర్ ప్రింట్స్ వాళ్ళ పని అయిపోయింది" అన్నాడు నాయర్.

డైరక్టరీలో నంబరు చూసి రూపా ఫార్మస్యూటికల్సు ఆఫీసుకు ఫోన్ చేశాను. అటువైపునుంచి ఆపరేటర్ "హాలో!" అంది.

"మీ మేనేజర్‌కి కనెక్షన్ ఇయ్యి" అన్నాను.

"ఎవరు మాట్లాడుతున్నారు సార్?"

"డిటెక్టివ్ పరశురామ్."

వెంటనే ఆమె కనక్షన్ యిచ్చింది.

"కామదేవ్ స్పీకింగ్, మిస్టర్ పరశురామ్."

"నాగేష్ ఆఫీసుకు వచ్చాడా?" అడిగాను.

"నో, సార్, రాలేదు. అతడు ప్రతిరోజూ రాడు. రోలింగ్ సేల్సుమన్ అతను. నెలకు రెండుసార్లు మాకు రిపోర్టు పంపుతాడు. పట్నంలో వుంటే ఎప్పుడేనా యిక్కడకు వస్తూంటాడు."

"అతడు యెక్కడున్నాడో మీకు తెలిస్తే వెంటనే నాకు ఫోన్ చేసి చెప్పండి" అని అనసూయ నంబరు యిచ్చాను.

"అలాగే చెప్తాను, సార్. ఏమైంది, అతడు దేనిలోనైనా యిరుక్కున్నాడా?" ప్రశ్నించాడతను.

"ఇంతకుముందు అతడిని గురించి యెవరేనా మీకు కంప్లెయిన్ చేశారా?"

"గత మూడేళ్ళనుంచి యెవరూ కంప్లెయిన్ చెయ్యలేదు. ఇంతకు ముందు అతడిని గురించి కొందరు మాకు ఆకాశరామన్న వుత్తరాలు రాసేవారు."

"ఏమని?"

"అతడు కాకినాడలో వున్నపుడు యెవరో యువతిని రేప్ చేశాడట. ఆమె నూతిలోపడి చనిపోయిందట. అతడిని వుద్యోగంలోంచి తీసేయమని మాకు వాళ్ళు రాశారు."

"మీరు ఏం చేశారు?"

"ఆ కంప్లెయింట్ గురించి నేనే విచారించాను. గిట్టనివాళ్ళెవరో రాసివుంటారని వదిలేశాం. అతడికి వార్నింగ్ యిచ్చాను. నాగేష్ చాలా కష్టపడి పనిచేసే మనిషి."

"ఆకాశరామన్న వుత్తరంలో ఆ అమ్మాయి పేరు

రాశారా?"

"లేదు. 1974 లో మార్చిలో అతడామెను రేప్ చేశాడట. అదే సంవత్సరం ఆగస్టులో ఆమె ఆత్మహత్య చేసుకొందిట. ఈ వివరాలు నా కింకా గుర్తున్నాయి."

"థాంక్స్ ఫర్ ది యిన్ఫర్మేషన్!" అన్నాను.

"పరశురామ్‌గారూ, పెళ్ళయినాక నాగేష్ మంచివాడై పోయాడు. ఎవ్వరూ అతడిని గురించి చెడుగా మాకు రాయలేదు."

"మీకు నాగేష్‌తో బాగా పరిచయముందిగా?"

"అఫ్‌కోర్స్."

"అతడు బాగా తాగుతాడా?"

"క్వార్టర్ బాటిల్ వరకూ వెళ్ళగలడు. అంతకు పైన అతడు తాగడు."

"అతడిలో కిల్లర్ సూచనలు ఏమైనా మీకు కనిపించాయా?"

"అతడు పొట్టిగా, సన్నగా వుంటాడు. మాటల్లో అనేకమందిని ఆకట్టుకొనే శక్తి అతడిలో విశేషంగా వుంది. వెరీ చార్మింగ్ కాన్వర్‌సేషనలిస్టు!"

అతడికి మళ్ళా థాంక్స్ చెప్పి రిసీవర్ని పెట్టేశాను.

"బ్రదర్, ఏదేనా తెలిసిందా!" అడిగాడు యిన్స్పెక్టర్ నాయర్.

"చక్రం తిరుగుతోంది. త్వరలో ఏదో తెలుస్తుంది," అని వేగంగా గెస్టురూమ్‌లోకి నడిచాను.

## 5

ఇన్స్పెక్టర్ నాయర్ తెచ్చిన పెళ్ళి ఫోటో వైపు చూశాను. నాగేష్, అనసూయ నవ్వుతూ వున్నారు ఆ ఫోటోలో. ఫోటోను చూస్తూంటే కామదేవ్ చెప్పింది

అక్షరాలా నిజమనిపించింది.

నాగేష్ పొట్టిమనిషి కాని అతడిలో ఏదో ఆకర్షణ కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

"నాయర్ భాయ్, నాగేష్ ఫియట్ కారు ఏమైందో మనకు తెలియాలి. రాష్ట్రంలోని ప్రతివూరుకీ ఆ కారు నంబర్ వివరాలు తెలియాలి. ఆంధ్రాలో కూడా ఆ కారు కోసం పోలీసులు వెతకాలి" అన్నాను.

"అదంతా చేయిస్తున్నాను."

ఒక మనిషి వచ్చి గుమ్మంలో ఆగాడు.

"మస్తాన్, లోపలకిరా" అన్నాడు నాయర్.

వాచ్‌మన్ మస్తాన్ లోపలకొచ్చాడు. అతడు పొడుగ్గా, బలంగా వున్నాడు. ఖాకీపాంట్, అదేరకం స్లాక్ వేసుకొన్నాడు. చేతుల్లో లాఠీ వుంది. అతడివైపు సూటిగా చూశాను.

"నిన్నరాత్రి పరాయివాళ్ళు యెవరైనా పది తర్వాత యీ భవనంలో ప్రవేశించారా?" ప్రశ్నించాను.

"చాలామంది వచ్చి, వెళ్ళడం నేను చూశాను సార్."

తను చూసిన వ్యక్తులను అతడు వర్ణించసాగాడు.

"నాగేష్ ఫియట్ కారు రాత్రి బయటకు వెళ్ళడం నువ్వు చూశావా?"

"లేదు సార్."

"మస్తాన్, క్రితంరాత్రి పన్నెండూ, ఒకటి మధ్య అనసూయ హత్య చేయబడింది. హత్యానంతరం హంతకుడు ఫియట్ కారులో వెళ్ళాడని మా నమ్మకం. ఆ కారును చూశావా?"

అతడు జవాబివ్వలేదు.

"రాత్రిళ్ళు నువ్వు కాంపౌండులో x స్త్రీ తిరుగుతూ

వుంటావా?"

"వుంటాను సార్. నిన్న నా మిత్రుడొకడు కొంచెం రమ్ యిచ్చాడు. అది తాగాక నిద్రొచ్చి పడుకొన్నాను."

"నీ మిత్రుడిచ్చిన రమ్ పూర్తిగా తాగేశావా?"

"కొంచెం తాగ్గానే యెందువలనో నిద్రవచ్చేసింది సార్. ఇంకా కొంత రమ్ నా బాటిల్లో వుంది సార్."

"వెళ్ళి వెంటనే ఆ బాటిల్ పట్రా" అన్నాను.

ఇన్స్పెక్టర్ నాయర్ ఒక కానిస్టేబుల్ని అతడి వెనకనే పంపాడు. కాస్సేపట్లో ఒక బాటిల్ తెచ్చి మస్తాన్ టీపాయిమీద పెట్టాడు. రమ్‌ని పరీక్షగా చూశాను. అందులో ఏదో కలపబడింది. సందేహంలేదు. బాటిల్ని నాయర్‌కిచ్చాను.

"నాయర్ భాయ్, దీన్ని లాబ్‌కి పంపు. దీనిలో ఏం కలిపారో తెలుస్తుంది."

"నా మిత్రుడు అటువంటి పని చెయ్యడు సార్" అన్నాడు మస్తాన్.

"నీకీ రమ్ యిచ్చిన మిత్రుడ్ని యిక్కడకు రప్పించాలి" అరిచాను గంభీరంగా.

"వద్దుసార్" అన్నాడు మస్తాన్ గాభరాగా.

"నిజంచెప్పు! ఈ రమ్ నీ కెవరు యిచ్చారు?"

"నాగేషేనా?" అన్నాడు యిన్స్పెక్టర్ నాయర్.

నాయర్ వైపు కోపంగా చూశాను. తడువునే బుర్రకు మనం జవాబు అందించకూడదు.

"నాగేష్‌గారే యిచ్చారు."

"నువ్వు అడక్కుండానే అతను యిచ్చాడా?"

"రాత్రి ఆయన నడవలో వున్నారు. సలామ్ చేశాను. నీరసంగా వుంటోందని ఆయనతో అన్నాను. ఆయన నన్ను

వుండమని లోపలకు వెళ్ళారు. పాతబుడ్డీలో రమ్ పోసి నా కిచ్చారు. కొంచెం తాగి, బాగా తిని పడుకోమన్నారు."

"తాగాక తిన్నావా?"

"నిద్ర ముంచుకొచ్చింది సార్-తిండి ముట్టుకోలేదు."

"నిన్నరాత్రి యెన్నింటికి యిది జరిగింది?"

"పది దాటింది సార్. సరైన టైము తెలియదు."

"నా గేమ్‌తో ఆ సమయంలో అనసూయ వుందా?"

"ఆమెను నేను చూడలేదు, సార్."

"నువ్వు చెప్పింది అబద్ధమైతే జైల్లో కూర్చోవలసి వస్తుంది" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"అంతా నిజం సార్."

"ఆల్ రైట్, వెళ్ళు" అన్నాను.

మస్తాన్ వెళ్ళిపోయాడు. కన్నమ్మ మెల్లిగా గదిలో కొచ్చింది.

ఆమెవైపు పరీక్షగా చూశాను.

"కన్నమ్మా, నీకు అనసూయతో బాగా పరిచయ ముందా?" అడిగాడు.

"అమ్మగారు చాలా మంచోరు బాబూ. ఈ పనీ, ఆ పనీ అప్పుడప్పుడు చేసిపెట్టేదాన్ని."

"భార్యాభర్తలు యిద్దరూ పోట్లాటలు లేకుండా వుండేవారా?"

"వారిద్దరూ పోట్లాడుకోడం నేను చూడలేదయ్యా."

"ఆ పసిబిడ్డను యెవరికి అప్పగించావు?" అడిగాడు నాయర్.

"బాబు తాతగారి ఒళ్ళో వున్నాడు. ఇటువైపున ఆ బిడ్డను చూడవలసింది ఆయనేగా!" అందామె.

ఆమెవైపు సూటిగా చూశాను.

"నాగేష్ రాడంటావా?"

"ఏ మొహంతో వస్తారయ్యా! ఆయనే చేసేరటగా యిదంతా?"

"అని యెవరు చెప్పారు నీకు?"

"తాతగారు చెప్పారు."

"తన భార్యను చంపిన మనిషిని వెంటాడుతూ నాగేష్ వెళ్ళివుండొచ్చు. ఎప్పుడో వస్తాడు" అన్నాను.

"ఏమో బాబయ్యా యిదంతా అర్థంకావడం లేదు."

"ఇద్దరూ సుఖంగా జీవిస్తున్నారని నువ్వే అన్నావు. ఆ పరిస్థితుల్లో ఏ మొగుడూ తన పెళ్ళాన్ని చంపడుగా."

"అవుననుకోండి."

ఆమెను వెళ్ళిపొమ్మన్నాను. ఒక కానిస్టేబుల్ గదిలో కొచ్చాడు. కొన్ని బ్యాంకు పుస్తకాలను ఇన్స్పెక్టర్ కి యిచ్చాడు. నాయర్ వాటిని నాకు అందించాడు. పుస్తకాలను తెరిచి చూశాను. కళ్యాణమూర్తి యిచ్చిన డబ్బును నాగేష్ తగలేయలేదు. అనేక బ్యాంకిల్లో ఫిక్సెడ్ డిపాజిట్స్లో రెండున్నర లక్షలికు పైన వుంది. సేవింగ్స అకౌంట్లలో వేలకువేలు రొఖ్ఖంగా వుంది.

కానిస్టేబులు బయటకు వెళ్ళిపోయాడు.

"నాయర్ భాయ్, ఇల్లు, కావలసినంత డబ్బు నాగేష్ పేర్న వుంది. ఇదంతా వదిలి, భార్యను చంపి, అతడు ఏమైనట్లు?" అన్నాను.

"అవును, అది పెద్ద ప్రశ్నే" అన్నాడు నాయర్.

"ఆ ఫియట్ కారులో అతడు యెక్కువ దూరం వెళ్ళ లేడు. పోలీసులు ఆ కారును గుర్తించి ఆపుతారు" అన్నాను.

హాల్లోని టెలిఫోన్ మ్రోగింది. ఇన్స్పెక్టర్ నాయర్

పరుగెత్తుకెళ్ళాడు. కాస్సేపట్లో అతడు తిరిగి వచ్చాడు. అతడి కంఠం కంచులా మ్రోగింది.

"బ్రదర్, ఫియట్ కారు బీచ్‌లోపల రోడ్డు మీద దొరికింది" అన్నాడతను.

"కారులో ఎవ్వరూ లేరు!" అన్నాను.

"లేరు" అన్నాడతను.

సోఫాలోంచి లేచాను.

"నాయర్ భాయ్, ఇక్కడి పని కానీ! నేను వెళ్ళి ఆ కారును చూసి తిరిగి వస్తాను" అని బయటకు పరుగెత్తాను.

## 6

బీచ్‌లో ఎవ్వరూ లేరు. సూర్యుడు ప్రకాశిస్తున్నాడు. ఫియట్ పక్కనే ఒక కానిస్టేబులు నిలబడి వున్నాడు.

డాడ్జి కారాపి దిగాను. ఫియట్ వైపు నడిచాను. కానిస్టేబులు నాకు శెల్యూట్ చేశాడు. ఫియట్ కారును పరీక్షించసాగాను. కారు ఇగ్నిషన్‌కీ కారులోనే వుంది. వెనక తలుపు తెరిచి సీటును చూశాను. సీటుమీద తడిగా వుంది. సీటు పొడుగునా వుంది తడి.

మద్రాసులో గత రాత్రి వానలేదు. ఈ సీటుకు తడి యెలా వచ్చింది? సిగరెట్ పీలుస్తూ ఆలోచిస్తున్నాను. అంతా అగమ్యగోచరంగా వుంది.

వెనుకనున్న డిక్కీ తెరిచి చూశాను. అందులో స్పేర్ టైర్ తప్ప మరేమీ లేదు. డిక్కీని మూసేశాను. నాగేష్ యీ కారులో వచ్చి వుంటే అతడు బీచ్‌కి యెందుకు వెళ్ళాడు?

భార్యను చంపినందుకు విచారిస్తూ, బాధపడ్తూ అతడు సముద్రంలోకి దూకేశాడా? ఆమెను చంపి తను ఆత్మహత్య చేసుకున్నాడా?

నేను చూసిన పెళ్ళి ఫోటో నాకు గుర్తు కొచ్చింది. నాగేష్ ఆత్మహత్య చేసుకునేరకం వ్యక్తి కాడు. పది మందిని జయించాలనే వుత్సాహం వుండే వ్యక్తి తన ప్రాణాన్ని తుదముట్టించుకోడు.

కిందకు దిగి కారు టైర్లవైపు చూశాను. ముందు టైర్లు యిసుకలో దిగబడి వున్నాయి.

కానిస్టేబులువైపు చూశాను.

"ఇక్కడే వుండు! కదలకు" అని హెచ్చరించాను.

"అలాగే సార్" అన్నాడతను.

డాడ్జి కారులో కూర్చుని తలుపు మూశాను. కారును వేగంగా పోనిచ్చాను. తోవలో అరుణ్ అండ్ కంపెనీ ముందు కారాపి దిగి లోపలకు వెళ్ళాను. మందుల కంపెనీ, ఓపెన్ డే అండ్ నైట్.

రిసీవర్ యెత్తి అనసూయ ఇంట్లో వున్న యిన్స్పెక్టర్ నాయర్ కి ఫోన్ చేశాను.

"హలో, యిన్స్పెక్టర్ నాయర్!"

"నాయర్ భాయ్, వెంటనే మీ ఫింగర్ ప్రింట్ మనుషులను బీచ్ లో వున్న ఆ ఫియట్ కారు దగ్గరకు పంపు. స్టీరింగ్ వీలుమీద, తలుపుమీద వేలిముద్రలు వున్నాయేమో చూడమను" అన్నాను.

"అలాగే, బ్రదర్" అన్నాడు నాయర్.

"నీ పని యెంతవరకూ వచ్చింది?"

"శవాన్ని పోస్టుమార్టమ్ కి పంపాను. ఇల్లంతా సోదా చేస్తున్నాం. రెండువేల పైన కాష్ వుంది. అనసూయ నగలన్నో గాడ్ రెజ్ బీరువాలో వున్నాయి. డబ్బు కోసం యీ హత్య జరిగివుండదు. ఆమె ఒంటిమీదున్న నగలను హంతకుడు పట్టుకుపోడం విచిత్రంగా వుంది."

"నాయర్ భాయ్, ఆమె నగలు ఎల్లప్పుడూ నాగేష్ చేతుల్లో వున్నాయి. వాటిని దొంగిలించవలసిన అవుసరం అతడికి లేదు" అన్నాను.

"యూ ఆర్ రైట్" అన్నాడు నాయర్.

"నాయర్ భాయ్, మీరు సోదాచేస్తే యింకా ఏం దొరికింది?"

"ఒకమ్మాయి ఫోటో దొరికింది. ఆ ఫోటో నాగేష్ దుస్తులు కింద దాచబడివుంది. విత్ లవ్ టు నాగేష్ అని రాసి నిర్మల అని సంతకం పెట్టింది. ఫోటో వెనక జైహింద్ ఫోటో స్టూడియో, కాకినాడ అని రబ్బర్ స్టాంప్ చేయబడింది" అన్నాడు నాయర్.

కాస్సేపు నేను మాట్లాడలేదు. కామదేవ్ చెప్పిన కాకినాడ కేసు నాకు గుర్తుకొచ్చింది. ఆత్మహత్య చేసుకొన్న యువతి నిర్మలేమో!

"బ్రదర్, వున్నావా?" అడిగాడు నాయర్.

"సజీవంగా వున్నాను," అన్నాను నవ్వుతూ.

"అనసూయ బీరువాలో ఒక శాండల్ వుడ్ పెట్టె దొరికింది. దానిమీద విత్ లవ్ ఫ్రమ్ రాజా అని చెక్కివుంది. ఆ రాజా ఆమె ప్రియుడేమో!"

"నాయర్ భాయ్, చిన్నతనంలో బర్త్ డే నాడు అనేకమంది ఏవేవో బహుమతులు యిస్తుంటారు. అందరూ విత్ లవ్ అని రాస్తారు. వాటిని మరోవిధంగా మనం తీసుకోకూడదు." అన్నాను.

"నేను మరో గంటలో వెళ్ళిపోతున్నాను. ఆ లోపల నువ్వు రావాలి," అన్నాడు నాయర్.

"తప్పక వస్తాను," అని రిసీవర్ని పెట్టేశాను.

పావుగంటలో అనసూయ యింటికి చేరుకున్నాను.

నాయర్ చెప్పిన నిర్మల ఫోటోను చూశాను. ఆమె అమాయకంగా వుంది. ఏదో ఆలోచనతట్టి హాల్లోవున్న ఫోన్ వద్దకు నడిచాను. రిసీవర్ని ఎత్తి కాకినాడకు ఎస్. టి. డి. కాల్ చేశాను.

"హలో, ఇన్స్పెక్టర్ రామారావు," అందో కంఠం అటువైపునుంచి.

"పరశురామ్," అన్నాను.

"చాలాకాలం తర్వాత మీ కంఠం వింటున్నాను," అన్నాడతను.

"రామారావ్, నాకు నీ సహాయం కావాలి. 1974 ఆగస్టులో ఒక యువతి నూతిలోపడి ఆత్మహత్య చేసుకుందిట మీ టౌన్‌లో. ఆమె ఎవరో కనుక్కో. ఆమెను గురించి పూర్తి వివరాలు నాకు వెంటనే కావాలి," అన్నాను.

"కనుక్కొని మీకు ఫోన్ చేస్తాను, నంబర్ చెప్పండి," అన్నాడతను.

అనసూయ టెలిఫోన్ నంబర్ చెప్పాను. మరీ ఆలస్యమైతే నా యింటి నంబర్కి ఫోన్ చెయ్యమన్నాను.

"అలాగే సార్," అన్నాడు రామారావు.

రిసీవర్ని పెట్టేసి సిగరెట్ వెలిగించాను. గెస్టురూమ్ లోకి వెళ్ళి సోఫాలో కూర్చున్నాను.

టెలిఫోన్ మ్రోగింది. ఫోన్‌లో మాట్లాడి యిన్స్పెక్టర్ నాయర్ గెస్టురూమ్‌లోకి వచ్చాడు.

"బ్రదర్, ఫియట్ కారు స్టీరింగ్ వీల్ మీద వేలి ముద్రలులేవు. ముందు తలుపులమీద కూడా లేవు. పూర్తిగా ఎవరో తుడిచేశారు." అన్నాడు యిన్స్పెక్టర్ నాయర్.

సిగరెట్ పొగ వదులుతూ నాయర్ వైపు చూశాను.

"నాయర్ భాయ్, అనసూయను చంపిన వ్యక్తి ఫియట్ కారులో పోయాడని అనుకుందాం. కత్తిపిడి మీదున్న వేలిముద్రల్ని అతడు తుడిచేయలేదు, కాని కారు స్టీరింగ్ వీల్ మీద వేలిముద్రలు లేకుండా జాగ్రత్త పడ్డాడు. ఇది చాలా విరుద్ధంగా వుంది." అన్నాను.

గదిలో పచార్లు చేస్తూ ఎంత ఆలోచించినా ఏమీ అర్థంకావడంలేదు. హాల్లోని టెలిఫోన్ మ్రోగింది. ఇన్స్పెక్టర్ రామారావేమో! నాయర్ ఫోన్ వైపు పరుగెత్తాడు.

సోఫాలో కూర్చొని మరో సిగరెట్ వెలిగించాను. ఇన్స్పెక్టర్ నాయర్ గదిలోకి రేసు హార్స్లా వచ్చాడు.

"బ్రదర్, ఏదో శవం ఒడ్డుకు కొట్టుకొచ్చిందట! బీచ్లో ఎవరో దాన్ని చూసి పోలీసు రిపోర్టిచ్చారు," అన్నాడు నాయర్.

నా మెదడులో ఏదో మెరిసింది. సోఫాలోంచి లేచాను.

"నాయర్ భాయ్, వెళ్దాం, పద!" అన్నాను.

డాడ్జికారును విమానంలా పోనిచ్చాను. ఇన్స్పెక్టర్ నాయర్ నా పక్కనే వున్నాడు. వెనక సీటుమీద యిద్దరు కానిస్టేబుల్స్. ఫియట్ కారును దాటి కొంచెం ముందుకెళ్ళి కారాపాను.

నాయర్, నేనూ దిగాం. సముద్రపొడ్డున కొంతమంది ప్రజలు గుమిగూడి వున్నారు. ఇసుకలో గబగబా నడుస్తూ అటువైపు వెళ్ళాను. నాయర్ నా వెనకనే వచ్చాడు.

ఒక కానిస్టేబుల్ మాకు శల్యూట్ యిచ్చి వెనక్కు జరిగాడు. ప్రజలు దూరంగా కదిలారు. తడి నేల మీద గోనిసంచిలోంచి బయటకు కనిపిస్తూన్న తలకాయవైపు

చూశాను. తలను పక్కకు తిప్పాను.

నాగేష్!

అతడి ముఖానికి అనేకచోట్ల చిల్లులున్నాయి. సముద్ర చేపలు చర్మాన్ని కొరుక్కుని తినేసి వుంటాయి. సంచి లోంచి అతడి శవాన్ని బయటకు పూర్తిగా కానిస్టేబుల్సు లాగారు. అతడి ఒంటిమీద గాయాలులేవు. పొట్ట వుబ్బి వుంది. నీళ్ళలో మునిగి నాగేష్ మరణించి వుండాలి.

ఇన్స్పెక్టర్ నాయర్ వైపు చూశాను.

"నాయర్ భాయ్, యీ శవాన్ని వెంటనే పోస్టు మార్టమ్‌కి పంపించు," అన్నాను.

మరోసారి నాగేష్ శవంవైపు చూశాను.

"నేను అనసూయ ఫ్లాట్‌కి వెళ్తాను. నాకోసం ఫోన్ కాల్ రావచ్చు" అన్నాను.

"వెళ్ళు, బ్రదర్," అన్నాడు నాయర్.

అనసూయ ఇంటికి చేరుకున్నాను. మెట్లెక్కుతూంటే ఒక కానిస్టేబుల్ దిగుతున్నాడు.

"మీకోసమే చూస్తున్నాను సార్. కాకినాడనుంచి కాలొచ్చింది" అన్నాడతను.

మెట్లమ్మట పైకి పరుగెత్తాను. హాల్లోకెళ్ళి రిసీవర్ని అందుకున్నాను.

"హలో, పరశురామ్," అన్నాను.

"పరశురామ్‌గారూ, నూతిలోపడి ఆత్మహత్య చేసుకున్న యువతి పేరు నిర్మల. ఎవరో ఆమెను మోసగించారట. ఆమెకు తల్లి, అన్నా వున్నారు. నిర్మల మరణించిన తర్వాత తల్లి ఎలకలను చంపే మందుతిని చనిపోయింది. అన్న ఆ యింటికి తాళంవేసి మద్రాస్ వెళ్ళాడని పక్క వాళ్ళు చెప్పారు. అక్కడ ఏదో ఉద్యోగం చేస్తున్నా

దేమో!" అన్నాడు ఇన్స్పెక్టర్ రామారావు.

"అన్న పేరేమిటి?"

"శ్రీధర్! కొన్ని ఏళ్ళుగా కాకినాడలోని అతడి ఇల్లు తాళంవేసే వుంది. పక్కింటి రామ్మూర్తికి అతడు వుత్తరాలు రాస్తూ వుంటాడు. రామ్మూర్తిని కలుసుకుని మాట్లాడాను. శ్రీధర్ లజ్ లో వున్న దేవీలాడ్జిలో వుంటున్నాడు."

"చాలా థాంక్స్, మిస్టర్ రామారావు," అన్నాను.

రిసీవర్ పెట్టేశాను. హాల్లోంచి బయటికొచ్చాను.

నడవలో కానిస్టేబుల్ నిలబడి వున్నాడు.

"నేను కాస్సేపట్లో తిరిగివస్తాను," అని అతడితో చెప్పి మెట్లు దిగాను.

లజ్ లోని దేవీలాడ్జి కాంపౌండ్ లో కారాపి దిగాను. శ్రీధర్ గురించి లాడ్జి గుమస్తాను అడిగాను.

"పైకి వెళ్ళండి, రూమ్ నెంబర్ 10," అన్నాడతను.

మెట్లమ్మట పైకి పరుగెత్తాను. పదో నెంబరు గది ముందు నిలబడ్డాను. తలుపు మూసివుంది. వేళ్ళతో తలపు మీద తట్టాను. లోపల్నుంచి జవాబులేదు. ఇంకా గట్టిగా తట్టాను.

కొంత సేపయ్యాక తలుపు తెరవబడింది. అమాంతంగా లోపలకెళ్ళి కాలుతో తలుపును మూస్తూ ఎదురుగా వున్న వ్యక్తివైపు చూశాను.

పాంట్, స్లాక్ లో వున్నాడతను. పొడుగ్గా బలంగా వున్న అతడివైపు చూస్తూ వుండిపోయాను.

గదిలో కిటికీదగ్గరగా మంచం వుంది. ఒక టీపాయ్ మీద రమ్ బాటిలు గ్లాసు వగైరాలున్నాయి.

"మిస్టర్ శ్రీధర్!"

"ఏం కావాలి మీకు?" అన్నాడతను బొంగురు కంఠంతో.

"సీతో మాట్లాడాలి."

"దేన్ని గురించి?"

"నాగేష్ గురించి."

అతడు నా వైపు విచిత్రంగా చూశాడు. అతడి కళ్ళు ఎర్రగా వున్నాయి.

"గదికి తాళంవేసి నాతో రా?" అన్నాను.

మెల్లిగా బయటకొచ్చాను. అతడు నేను చెప్పిన ప్రకారం బయటకొచ్చి తలుపు మూసి తాళంవేశాడు. ఇద్దరం మెట్లుదిగి డాడ్జికారువైపు వెళ్ళాం. అతడిని ముందు సీటుమీద కూర్చోబెట్టి తలుపు మూశాను. స్టీరింగ్ వీలు వెనక కూర్చుని సిగరెట్ వెలిగించాను. తలుపుమూసి కారును పోనిచ్చాను.

అతడు నా పక్కనే మౌనంగా కూర్చున్నాడు. నాతో పోట్లాడి పారిపోవడానికి అతడు ప్రయత్నించలేదు.

మిడ్‌లాండ్ అపార్టుమెంట్స్ కాంపౌండ్‌లో కారాపి దిగాను. అతడిని పైకి తీసుకెళ్ళాను. గెస్టు రూమ్‌లోని సోఫాలో అతడు కూర్చున్నాడు. అతడికెదురుగా నిలబడ్డాను.

"నాగేష్‌ని ఎందుకు చంపావు?"

"రాస్కెల్! రేపిస్టు! వాడు నా చెల్లెల్ని రేప్ చేసి వదిలేశాడు. నిర్మల అమాయకురాలు. నూతిలోపడి చచ్చింది. తర్వాత నా తల్లి విషం తిని మరణించింది. నాగేష్‌ని చంపడం కోసమే నేనిక్కడికొచ్చాను" అన్నాడతను.

ఇన్‌స్పెక్టర్ నాయర్ గదిలో కొచ్చాడు. సోఫాలో

వున్న శ్రీధర్ వైపు ఆశ్చర్యంగా చూశాడు.

"నాయర్ భాయ్, అతడే హంతకుడు. శ్రీధర్!" అన్నాను.

ఇన్స్పెక్టర్ నాయర్ అతడి చేతులకు బేడీలు వేశాడు. కానిస్టేబుల్సు గోడవారగా నిలబడ్డారు.

"సిగరెట్ ప్లీజ్" అన్నాడు శ్రీధర్.

అతడి పెదిమలమధ్య సిగరెట్ వుంచి, వెలిగించాను. పొగవదుల్తూ శ్రీధర్ కూర్చున్నాడు.

"అనసూయను ఎందుకు చంపావు?"

"ఆమెను చంపాలనే వుద్దేశం నాకు లేదు. బేదింగ్ టబ్‌లోని నీళ్ళలో ముంచి, గట్టిగా నొక్కిపెట్టి ఆ దుర్మార్గుడిని చంపేశాను. ఆమె నన్ను చూసింది. అందు వలన ఆమెను కత్తితో పొడిచి చంపవలసి వచ్చింది."

"తర్వాత కత్తిపిడిమీద నాగేష్ వేలిముద్రలు వుండేటట్లు చూశావు!" అన్నాను.

అతడు తలాడించాడు.

"ఈ నేరం నాగేష్ చేసినట్లు పోలీసులు అనుమానించాలని ఎంతో శ్రమపడ్డావు!" అన్నాను.

శ్రీధర్ నావైపు చూసి పిచ్చిగా నవ్వాడు.

"నా పగ తీర్చుకున్నాను. నేను ఏమైనా నాకు బెంగలేదు," అన్నాడతను.

జేబులోంచి పాకెట్ తీసి సిగరెట్ వెలిగించాను.

"నాయర్ భాయ్, ఐ టేక్ లివ్ ఆఫ్ యు," అని నాయర్‌తో చెప్పి బయటకు నడిచాను.

—: ఐ పో యి ం ది :—